ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 12 ఫిబ్రవరి 2024



విస్సన్నపేటలో భూముల్లో ఎక్స్‌కవేటర్‌తో చదును పనులు చేస్తున్న దృశ్యం

పరవాడలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు దాడులు

నాలుగు డంపర్ లారీలు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

- ఫార్మా సిటీలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు గ్రావెల్ తవ్వుతున్నట్టు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వెల్లడి
- గనుల శాఖ నుంచి అనుమతులు అవసరం లేదట!
- తెరవెనుక అధికార పార్టీ వార్డు నాయకుడు



పోలీసులు స్వాధీనం చేసుకున్న డంపర్ లారీలు

పరవాడ, ఫిబ్రవరి 11:

ఫార్మా సిటీలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు మాటున ఏపీఐఐసీ అధికారులు పరవాడలోని ప్రభుత్వ భూమిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారు. పోలీసులు దాడులు నిర్వహించి ఒక ఎక్స్‌కవేటర్, నాలుగు డంపర్ లారీలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పోలీసులు మరింత లోతుగా ఆరా తీయగా, అధికార వైసీపీకి చెందిన ఒక నాయకుడు.. ఏపీఐఐసీ అధికారులను తెరముందు ఉంచి గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుకుపోతున్నట్టు తేలింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లోగల కొండ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్టు కొంతమంది స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ బాలసూర్యారావు ఆదేశాల మేరకు సిబ్బంది అక్కడకు వెళ్లి గ్రావెల్ తవ్వకందారులను ప్రశ్నించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ఒక ఎక్స్‌కవేటర్, నాలుగు డంపర్లను (పెద్ద లారీలు) స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రావెల్ తవ్వలకు సంబంధించి అనుమతులు వున్నాయా అని సీఐ బాలసూర్యారావు అడగ్గా, ఫార్మా సిటీలో ఏపీఐఐసీ పనుల కోసం గ్రావెల్ తీసుకెళుతున్నామని వారు చెప్పారు. మైనింగ్ శాఖ జారీ చేసిన అనుమతి పత్రాలు చూపించాలని సీఐ అడగ్గా.. తమ వద్ద లేవని వారు చెప్పారు. దీంతో ఆయన ఈ విషయాన్ని అనకాపల్లి మైనింగ్ ఏడీకి తెలియజేశారు. అనంతరం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్‌కు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరణ కోరగా, ఫార్మా సిటీలో సబ్‌స్టేషన్ ఏర్పాటు పనుల కోసం పరవాడలో తమ సంస్థకు చెందిన స్థలంలోనే గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నామని చెప్పారు. అయినప్పటికీ గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు ఉండాలి కదా? అని ప్రశ్నించగా ప్రభుత్వానికి చెందిన పనులు కాబట్టి అనుమతులు అవసరం లేదని జోనల్ మేనేజర్ సమాధానమిచ్చారు. వాస్తవంగా గ్రావెల్ తవ్వుతున్న ప్రదేశం సర్వే నంబరు 11లో వుంది. ఇది పూర్తిగా రెవెన్యూ స్థలం. ఏపీఐఐసీకి ఇక్కడ భూములు లేవు. కాగా గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ ఏడీని ఫోన్‌లో వివరణ కోరగా, తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

తెరవెనుక వైసీపీ నేత!

పరవాడలో సర్వే నంబరు 11లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, తరలింపు మాటున అధికార పార్టీకి చెందిన 77వ వార్డు నాయకుడు వున్నట్టు తెలిసింది. ఒక ఇన్‌ఫ్రా కంపెనీని నడుపుతున్న ఇతని చేతిలో ఇరవై వరకు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు వున్నట్టు స్థానికంగా చెప్పుకుంటున్నారు. గ్రావెల్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించిన వాహనాలు ఇతనివేనని తెలిసింది. ఏపీఐఐసీ అవసరాల మాటున పరవాడలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై అధికారులు లోతుగా దర్యాప్తు జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు, స్థానికులు కోరుతున్నారు.



పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో గ్రావెల్ తవ్విన ప్రదేశం ఇదే

మళ్లీ భూ యజ్ఞం!

- లోకాయుక్తలో కేసు నడుస్తున్నా.. అక్రమార్కులు బేఖాతరు
- వారం నుంచి జోరుగా పనులు సాగుతున్నా పట్టించుకోని అధికారులు

విస్సన్నపేట వివాదాస్పద భూముల్లో చదును పనులు



విస్సన్నపేటలో లేఅవుట్‌లో వేసిన భారీ రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైసీపీ భూ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. ఎన్నికలు సమీపిస్తుండడంతో దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోనే పనిలో పడ్డారు. పెద్దస్థాయి నేతల అండదండలు పుష్కలంగా వుండడంతో కోర్టు వివాదాల్లో వున్న భూముల్లోకి కూడా చొరబడుతున్నారు. యంత్రాలతో చదును పనులు చేస్తున్నారు. కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని భూముల్లో తాజాగా జరుగుతున్న పనులే ఇందుకు ఒక ఉదాహరణ. ఈ భూములపై లోకాయుక్త విచారణ సాగుతున్నప్పటికీ దర్జాగా భూముల్లోకి చొరబడి గత కొద్ది రోజులుగా అనధికార లేఅవుట్ పనులు చకచకా కానిచ్చేస్తున్నారు.

కశింకోట మండలం విస్సన్నపేట సర్వే నంబరు 195/2లో సుమారు 610 ఎకరాలు వుండగా ఇందులో 300 ఎకరాలు జిరాయితీ భూములు. మరో 300 ఎకరాలు ప్రభుత్వ బంజరు, సీలింగ్, డి.పట్టా భూములు, కొండలు వున్నాయి. పక్కనే 49.66 ఎకరాల్లో రంగబోలు గెడ్డ వుంది. ఈ భూములపై కన్నేసిన వైసీపీ నాయకులు కొందరు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వ బంజరు, డిపట్టా, సీలింగ్ భూములను అక్రమంగా సొంతం చేసుకున్నారు. జిరాయితీ భూమితోపాటు ఆక్రమించిన భూముల్లో ఏ ఒక్క ప్రభుత్వ శాఖ నుంచి కూడా ఎటువంటి అనుమతులు పొందకుండా రిసోర్ట్ పేరుతో చదును పనులు చేపట్టారు. వందల సంఖ్యలో చెట్లను నరికివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి రంగబోలుగెడ్డ రిజర్వాయర్‌లోకి నీరు వెళ్లే వాగులను మట్టి, గ్రావెల్, రాళ్లతో పూడ్చేశారు. ప్రధాన రహదారి నుంచి రిసార్టు భూముల్లోకి 120 అడుగుల వెడల్పుతో డి.పట్టా భూముల్లో నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో అప్పటి అనకాపల్లి ఆర్డీవో, కశింకోట తహసీల్దార్, ఇతర అధికారులు వచ్చి పరిశీలించారు. భూముల చదును పనులు నిలుపుదల చేయించలేదు. అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. విపక్షాల నేతలు అనేకసార్లు మండలస్థాయి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. కొండపోరంబోకు భూములు, వాగులు, గోర్జి కబ్జాకు గురవుతున్నాయని, వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారని స్థానికులు ఆందోళనలు చేయడంతో ఎట్టకేలకు 2022లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అప్పటి అనకాపల్లి ఆర్డీఓ నేతృత్వంలో నలుగురు రెవెన్యూ అధికారులతో కమిటీ వేసి విచారణకు ఆదేశించారు.

నాటి అనకాపల్లి ఆర్డీవో, సర్వే, గనుల శాఖ ఏడీలు, అనకాపల్లి తహసీల్దార్, ఇనామ్ తహసీల్దారుతో కూడిన కమిటీ పలు పర్యాయాలు విస్సన్నపేటలో చదునుచేసిన భూములను పరిశీలించి, అనేక అక్రమాలు చోటుచేసుకున్నట్టు గుర్తించింది. వందల ఎకరాలను చదునుచేసే క్రమంలో చెట్లు నరికివేశారు. సహజసిద్ధమైన వాగులు, గెడ్డలను పూడ్చేశారు. భూముల చదును సమయంలో కొట్టిన చెట్లు, తవ్విన మట్టి తరలింపునకు పంచాయతీ, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకోలేదు. చదును చేస్తున్న భూములున్న ప్రాంతానికి వెళ్లేందుకు ప్రభుత్వ భూమితో పాటు దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం కొండను తవ్వేసి.. గనుల శాఖ అనుమతి తీసుకుండా మట్టి, రాళ్లు తరలించారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించారు. ఈ మేరకు నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. కానీ ఈ నివేదికను ఇంతవరకు బహిర్గతం చేయలేదు. కొంతకాలం తరువాత ఈ భూముల్లో మళ్లీ లేఅవుట్ పనులు మొదలు పెట్టడంతో విస్సన్నపేట భూదందాపై విచారణ జరిపించాలని జనసేన నాయకుడు దూలం గోపి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై సుమోటోగా కేసు విచారణకు స్వీకరించి లోకాయుక్త అనకాపల్లి కలెక్టర్ నుంచి పూర్తి వివరాలు సేకరించి, విచారణకు ... మిగతా 8వ పేజీలో

సీఎం జగన్ విశాఖ రాక రేపు

ఆడుదాం ఆంధ్ర ముగింపు వేడుకలకు హాజరు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖపట్నం రానున్నారు. పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగే 'ఆడుదాం ఆంధ్ర' ముగింపోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. మంగళవారం సాయంత్రం 5.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 5.45 గంటలకు ఐటీ హిల్-3పై ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ఆరు గంటలకు పీఎంపాలెం క్రికెట్ స్టేడియంకు వస్తారు. ప్రజలకు అభివాదం చేసిన అనంతరం క్రికెట్ ఫైనల్ మ్యాచ్ చివరి ఐదు ఓవర్లను తిలకిస్తారు. మ్యాచ్ ముగిసిన తర్వాత క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడి, విజేతలకు బహుమతులు అందజేస్తారు. అనంతరం రాత్రి 8.05 గంటలకు రోడ్డుమార్గంలో విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరి వెళ్తారు.

ఆడుదాం ఆంధ్రపై ఆటగాళ్ల అసహనం

- భోజనం తినలేకపోయిన క్రీడాకారులు
- మైదానం గట్టిగా ఉండడంతో గాయాలపాలు



కబడ్డీ పోటీల్లో కింద పడిపోవడంతో తలకు గాయమై బాధపడుతున్న క్రీడాకారిణి

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మూడు రోజులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో జరుగుతున్నాయి. పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో మ్యాచ్‌లు నిర్వహించారు. మైదానంలో నేల గట్టిగా (హార్డ్)గా ఉండడంతో పలువురు క్రీడాకారులకు గాయాలయ్యాయి. వైద్య సిబ్బంది చికిత్స అందించారు. మైదానాన్ని సరిగా సిద్ధం చేయలేదని క్రీడాకారులు అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆటగాళ్లకు అందించిన బిర్యానీ బాగా లేకపోవడంతో పలువురు డస్ట్‌బిన్‌లో పడేశారు. చాలామంది క్రీడాకారులు పెరుగన్నంతోనే సరిపెట్టుకున్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలకు అధికారులు సరైన ఏర్పాటు చేయలేక పోయారని క్రీడాకారులు వాపోయారు.

రాష్ట్రస్థాయి జూనియర్ ఉమెన్ హాకీ టోర్నీ విజేత అనకాపల్లి జిల్లా



ట్రోఫీని అందుకుంటున్న జిల్లా జూనియర్ ఉమెన్ హాకీ జట్టు

ఎలమంచిలి, ఫిబ్రవరి 11:

రాష్ట్రస్థాయి జూనియర్ ఉమెన్ హాకీ టోర్నీలో అనకాపల్లి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో సత్యసాయి జిల్లా జట్టుపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుందని జిల్లా హాకీ అడ్‌హాక్ కమిటీ వైస్ చైర్మన్ కొరారు నరేశ్ తెలిపారు. శ్రీకాకుళంలో ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన 14వ అంతర్ జిల్లా జూనియర్ ఉమెన్ హాకీ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్ పోటీలో అనకాపల్లి జిల్లా జట్టు శ్రీకాకుళం జట్టుపై పెనాల్టీ షూట్ అవుట్‌లో (2-0 స్కోరు) విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో 2-0 గోల్స్ తేడాతో సత్యసాయి జిల్లా జట్టును ఓడించింది. ఝాన్సీ, కుసుమ.. చెరొక గోల్ చేశారు. విజేత జట్టును అడ్‌హాక్ కమిటీ చైర్మన్ ఆడారి వీరునాయుడు, ప్రతినిధులు ఏబీఎల్ రాజు, నేవీ రాంబాబు అభినందించారు.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు



ఇల్లు, ఒళ్లు గుల్ల

- ఆదాయంలో సగానికిపైగా తాగుడికే ఖర్చు పెడుతున్న రోజువారీ కూలీలు
- రేట్లు పెరగడం, నాణ్యత లేకపోవడంతో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సమస్యలు
- కౌన్సెలింగ్ కోసం తీసుకువెళుతున్న కుటుంబసభ్యులు
- నెరవేరని మద్య నిషేధం హామీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారీగా మద్యాన్ని నిషేధిస్తాం. అక్క, చెల్లెమ్మల కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న మద్యాన్ని, స్టార్ హోటళ్లకు పరిమితం చేస్తాం'

- ఇవీ ప్రతిపక్షంలో ఉండగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు.



...అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ఆ హామీని పూర్తిగా విస్మరించారు. పైగా మద్యం దుకాణా లను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడుపుతూ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మార్చారు. ఇంకా ధరలు విపరీ తంగా పెరగడం, నాణ్యత లేకపోవడంతో మందు బాబులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా దెబ్బతింటున్నారు. గడిచిన 20 ఏళ్ల నుంచి తాగుతున్నానని, గడిచిన ఐదేళ్ల నుంచి అమ్ము తున్న మద్యాన్ని ఎప్పుడూ చూడలేదని విశాఖలో నివాసం ఉంటూ తాపీ పని చేసుకుంటున్న రామారావు పేర్కొన్నాడు. వారం కిందట కడుపులో మంటగా ఉండ డంతో ఆస్పత్రికి వెళ్లిన రామారావుకు అల్సర్లు ఫామ్ అయ్యాయని వైద్యులు చెప్పారు. తాగుడుకు దూరంగా ఉండకపోతే ప్రమాదమని హెచ్చరించారు.

- విశాఖలో ఉంటూ భవన నిర్మాణ పనికి వెళ్లే శ్రీనుకు తాగుడు అలవాటు ఉంది. గతంలో పనికి వెళ్లి వచ్చిన తరువాత తాగి ఇంట్లోనే ఉండేవాడు. ఈ మధ్యకా లంలో ఉన్న డబ్బు మొత్తం తాగుడికే ఖర్చు పెడుతు న్నాడు. అతడిని కుటుంబ సభ్యులు మానసిక వైద్యు ల వద్దకు తీసుకువెళ్లి చూపించగా, కౌన్సెలింగ్ నిర్వ హిస్తున్నారు. అయినా, ఫలితం లేకుండా పోతోంది. మందులు వాడుతున్న సమయంలో కూడా మద్యం తాగేస్తుండడంతో సమస్య మళ్లీ మొదటకు వచ్చేసింది.
- శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ అనే యువకుడు నగర పరిధిలోని ఓ టీ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఏడాదిన్నర నుంచి మద్యానికి అలవాటుపడ్డాడు. తాగుడుకు అలవాటుపడిన దగ్గర నుంచి షాపు తీయక పోవడం, ఇంటికి ఫుల్లుగా తాగి వెళుతుండడంతో కుటుంబ సభ్యులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కొద్దిరోజుల కిందట నుంచి వాంతులు అవుతుండడంతో వైద్యుల వద్దకు తీసుకువెళ్లారు. లివర్‌లో సమస్య ఉందని, మందుకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అతడిని తీసు కుని కుటుంబ సభ్యులు సొంతూరు వెళ్లిపోయారు. వైద్యం కోసం నెల రోజులకు ఒకసారి కేజీహెచ్‌కు వస్తున్నారు.

ఆదాయంలో సగానికిపైగా మందుకే...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలకృష్ణ పదిహేనేళ్ల కిందట ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చాడు. ఇసుకతోటలో ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



కాశి కనకశ్రీదేవి (ఫైల్ ఫొటో)

కశింకోట, ఫిబ్రవరి 11: మండలంలోని బయ్యవరం బ్రిడ్జి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ కె.వినోద్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన కాశి కనకశ్రీదేవి(40), భర్త కాశి రాము ద్విచక్రవాహనంపై ఏటికొప్పాక వెళుతుండగా అనకాపల్లి నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న ఒక కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెనుక వైపు కూర్చున్న కనకశ్రీదేవి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త రాముకు స్వల్పంగా గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భర్త రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కలుపు నివారణ మందు తాగి ఒకరి ఆత్మహత్య

కె.కోటపాడు, ఫిబ్రవరి 11: పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్న భర్తను భార్య నిలదీయడంతో మనస్తాపం చెంది కలుపు నివారణ మందు తాగిన ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన శానాపతి అంజి(37) స్వల్ప అనారోగ్యంతో నెల రోజులుగా పనిలోకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. భర్త పనిలోకి వెళ్లడం లేదని భార్య లక్ష్మి నిలదీయడంతో మనస్తాపం చెంది శనివారం మధ్యాహ్నం వరిచేనుకు వాడే కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక 30 పడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్ రిఫర్ చేయగా, అక్కడ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అదుపుతప్పి రెండు కార్లు బోల్తా



అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై బోల్తా పడిన కారు



గెడ్డపాలెం రోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కన కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 11: మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం రెండు కార్లు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదాల్లో ఒకరికి స్వల్ప గాయాలైనట్టు హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు. వారు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ నుంచి రాజమండ్రి వెళుతున్న కారు గెడ్డపాలెం రోడ్డు వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి జాతీయ రహదారికి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. కారులో ముగ్గురు ప్రయాణికులతో పాటు డ్రైవర్ ఉండగా, డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. అతనిని నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే విజయవాడ నుంచి విశాఖ వెళుతున్న కారు అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ కారు బోల్తా పడిన సమయంలో వెనుక నుంచి వాహనాలు ఏమీ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కారులో సుమారు ఏడేళ్ల బాలుడితో పాటు అతని తండ్రి ఉన్నారు. ఈ ప్రమాదంలో కారు దెబ్బతిన్నప్పటికీ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

హత్యాయత్నానికి పాల్పడిన మహిళ అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 11: తన భర్తతో వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో మహిళపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన అల్లంగి చిన్నమ్మలును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు మాడుగుల ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ కాశీపురం గ్రామంలో తన భర్త అల్లంగి పోతురాజుతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో లక్ష్మిపై పోతురాజు భార్య చిన్నమ్మలు పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. కాలిన గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు చిన్నమ్మలును అరెస్టు చేసి శనివారం సాయంత్రం చోడవరం కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఆమెకు 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు.

వేర్వేరు చోట్ల 27 మద్యం బాటిళ్లు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 11: లంకెలపాలెం గ్రామానికి చెందిన జోగా నూకాలమ్మ పాన్‌షాపులో మద్యం అమ్మకాలు జరుపుతున్నారని సమాచారం మేరకు ఎస్ఐ సురేశ్ తమ సిబ్బందితో ఆదివారం రాత్రి సోదాలు నిర్వహించారు. షాపులోని గల 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఫార్మాసిటీకి చెందిన నరసింగరావు అనే వ్యక్తి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 12 బాటిళ్ల కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా ఎస్ఐ మల్లేశ్వరరావు లంకెలపాలెం వినాయకనగర్ వద్ద అడ్డగించి అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐలు సురేశ్, మల్లేశ్వరరావులు తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై నిగ్గు తేల్చాలి

- మాజీ మంత్రి బండారు డిమాండ్

పరవాడ, ఫిబ్రవరి 11: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో గ్రావెల్ అక్రమ తవ్వకాల వ్యవహారంపై నిగ్గు తేల్చాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. పరవాడ సర్వే నంబరు 11లో గ్రావెల్ తవ్వకాలు జరపడం వెనుక ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హస్తం ఉందని ఆరోపించారు. సబ్‌స్టేషన్ పనుల కోసమని గ్రావెల్‌ను తరలిస్తున్నామని జోనల్ మేనేజర్ చెప్పడం దారుణమన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుల అదుపులో ఉన్న వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రిలీజ్ చేయకూడదని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బండారు అన్నారు.

'మోటార్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి'



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పరవాడ, ఫిబ్రవరి 11: ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న మోటార్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సమ్మెకు సంబంధించి కరపత్రాలను ఆటో కార్మికులతో కలిసి ఆదివారం లంకెలపాలెంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బీఎన్ఎస్ 106 సెక్షన్ రద్దు చేయాలని, జీవో నంబరు 21ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. బీఎన్ఎస్ చట్టంలోని కఠినమైన షరతులను మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నరసింగరావు, రామారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

పరీక్షా సమయం!

విద్యార్థుల్లో ఆందోళన



- ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు
- సూచిస్తున్న నిపుణులు
- పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే...
- ఒత్తిడి తెస్తే ఆరోగ్యంపై ప్రభావం!

విశాఖపట్నం, ఫిబ్రవరి 11:

కొద్ది రోజుల్లో ఇంటర్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యా సంవత్సరంముగింపు దశలో ఉండడంతో పిల్లలు, తల్లిదండ్రులపై ఒత్తిడి పెరుగుతోంది. మరో పక్క ఉపాధ్యాయులపై యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్నాయి. సిలబస్ పూర్తి చేయడం, రివిజన్ లాంటివి కొనసాగుతున్నాయి. ఇంతకుముందు పాఠశాలలో విద్యార్థులందరూ పాసైతే మంచి ఫలితాలుగా చూసేవారు. కానీ ప్రస్తుతం ర్యాంకుల గోలతో ఎవరు ఎక్కువ మార్కులు తెచ్చుకుంటారోననే పోటీ పెరిగింది. వెరసి అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులపై ఒత్తిడితో విద్యార్థులకూ ఆందోళన పెరుగుతోంది. మార్కుల ఒత్తిళ్లు కొంప ముంచుతున్నాయని ఓ పక్క ప్రభుత్వం, మానసిక వైద్య నిపుణులు, విద్యావేత్తలు చెబుతున్నా... పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే ర్యాంకులే ఆలంబనని పాఠశాలల యాజమాన్యాలు భావిస్తున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు కూడా ఇదే పంథాలో ఆలోచిస్తున్నారు. నూటికి 99 వస్తే ఆ ఒక్కటీ ఎందుకు పోయిందనే ప్రశ్నే ఉత్పన్నమవుతోంది. పగలూ రాత్రీ తేడా లేకుండా పరీక్షలకు సిద్ధమవడం, ఏం తింటున్నారో, ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితుల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని నిపుణులు చెబుతున్నారు.



బాగా చదువుకునే విద్యార్థులు సైతం పరీక్షల ఒత్తిడి కారణంగా అనారోగ్యానికి గురికావడం, ఆస్పత్రుల చుట్టూ తిరగడం చూస్తుంటాం. అందుకే ప్రణాళికా బద్ధంగా చదవడం అలవాటు చేయడమే కాకుండా, ఒత్తిడి లేకుండా చదవడం శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు. మార్కులొక్కటే ఉన్నత స్థానంలో నిలబెట్టవన్నది గమనించాలి. సంగీత ప్రపంచాన్ని ఓలలాడించి ఆస్కార్ గెలుచుకున్న ఏఆర్ రెహమాన్ చదువులో వెనుకబడేవారు. భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన అల్బర్ట్ ఐన్‌స్టీన్ చదువులో చాలా వెనుకబడి ఉండేవారు. ఇతడి విషయంలో ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉండేవారు. వరుస విజయాలతో ఆత్మస్థైర్యం పెరుగుతుందేమో కానీ, ఒక్క ఓటమి వచ్చినా తట్టుకోలేని పరిస్థితికి వెళ్లిపోతారు.

ఓటమినే విజయంగా...

విద్యార్థి దశలోనే ఓటమి చవి చూసిన వారు దానిని విజయానికి పది మెట్లుగా మలచుకుంటారు. ఒక్క ఓటమి జీవిత గమనాన్ని నిర్దేశించలేదు. అందుకే పిల్లలకు చదువొక్కటే జీవితం కాదని తల్లిదండ్రులు చెప్పాలి. తద్వారా మానసిక ఒత్తిడి తగ్గించడమే కాకుండా ఫలితాల పట్ల సానుకూల దృక్పథం కలుగుతుంది. మంచి మార్కులు తెచ్చుకోవడానికి ప్రయత్నించమనాలి తప్ప ర్యాంకులకోసం ఒత్తిడి చేయకూడదు. వారిలో ఆ ఆలోచన ఉన్నా, ఫలితాలు ఎలా వచ్చినా అంగీకరించే స్థాయికి తీసుకురావాలి.

తల్లిదండ్రులు ఇలా...

చదువే సర్వస్వం అనుకునే తల్లిదండ్రులూ లేకపోలేదు. వీరు తమ పిల్లల్ని ఏ స్థాయికి తీసుకువెళ్లాలో ముందే నిర్ణయించేసుకుంటారు. ఆ దిశగా ఒత్తిడి చేస్తుంటారు. కొన్నిసార్లు పిల్లలు తమ తల్లిదండ్రుల ఆసక్తి మేరకు... వారు నిర్దేశించిన దారిలోనే వెళ్తారు. కానీ కొందరు ఆయా విభాగాల్లో సరైన ఫలితాలు సాధించలేక చతికిల పడుతుంటారు. సమస్యను తల్లిదండ్రులకు చెప్పలేక, చెప్పినా సరైన స్పందన రాక మానసిక ఒత్తిడిలో ఉంటారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలపై ఎలాంటి ఒత్తిడీ చేయరు. చదివినంత చదువుకో, నీ భవిష్యత్తు నీ ఇష్టం అన్న రీతిలో ఉంటారు. కేవలం పిల్లల అనుమానాలు, సందేహాలను నిపుణులతో నివృత్తి చేస్తుంటారు. దీనివల్ల వారు ఒక్కో అంశంపై అవగాహన పెంచుకుని ముందుకు వెళ్తుంటారు. తల్లిదండ్రులకు మరో రంగంపై ఆసక్తి ఉంటే, వాటి పట్ల పిల్లల శ్రద్ధ, శక్తి ఏపాటిది అన్నది తెలుసుకుని, మార్గనిర్దేశం చేస్తుంటారు. మరికొందరు తల్లిదండ్రులను చూస్తే మనకే ఆశ్చర్యం వేస్తుంది. వారి పిల్లల్లో ఎవరైనా చదువులో వెనుకబడి ఉన్నా టెన్షన్ పడరు. మార్కుల విషయంలో ఒత్తిడి చేయరు. పర్వాలేదులే ఒక్క సబ్జెక్టు ఫెయిల్ కాకుండా చూసుకో అంటారు. పరీక్షలు అయిపోయాక, ఫలితాలకు ముందు ఒకటో రెండో సబ్జెక్టులు ఉండిపోయినా మళ్లీ అవకాశం ఉంటుందిగా అప్పుడు రాసుకోవచ్చులే అంటారు. వారికి సమాజంపై అవగాహన కల్పిస్తుంటారు. ఇతర అంశాల్లో వీరికి పరిణితి వచ్చేలా జాగ్రత్త పడతారు.

ఏం జరిగితే... ఏమౌతుంది?

పిల్లలు ఏం చేస్తే, ఫలితాలు ఎలా ఉంటాయనేదానిపై ఆలోచన చేస్తూ ఉండాలి. ర్యాంకుల కోసం పోటీ పడుతున్న విద్యార్థికి ఎలా చెప్పాలి, మంచి మార్కుల కోసం తపనపడే పిల్లలకు ఏం చెప్పాలి? అత్తెసరు మార్కులతో చదివేవారికి ఎలా చెప్పాలి? ఇవన్నీ ఆలోచించాలి. తల్లిదండ్రుల ప్రవర్తన బట్టి పిల్లలుంటారు. వారు తమ వంతు ప్రయత్నం చేస్తారు. ఒక వేళ పరీక్ష తప్పినా తల్లిదండ్రులు తిట్టరనే భావన ఉంటుంది. పిల్లలు తప్పుదారిన వెళ్లకుండా చూసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. మరి కొందరు తల్లిదండ్రులు విద్య అవసరమే కానీ జీవితం ఆగిపోదని పిల్లలను అనునయిస్తారు. ఫలితాల ముందు మరింత స్పష్టంగా ఉంటారు. చదువే సర్వస్వం కాదని, జీవితం ముఖ్యమని వారికి అర్థమయ్యేలా చెప్పడంతో పాటు, మేమున్నది మీకోసమేననే సంకేతాలను ఇస్తారు.

ఘనంగా రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీలు



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు



సీనియర్ విభాగం విజేత తరఫున మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు నుంచి బహుమతి అందుకుంటున్న కమిటీ ప్రతినిధులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 11: స్థానిక ఘంటసాల కళామందిర్ ఆవరణలో ఆదివారం ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన పాటల పోటీలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి సీనియర్, జూనియర్ విభాగాల్లో మొత్తం 42 మంది కళాకారులు పాల్గొని ఘంటసాల పాటలను ఆలపించారు. సాయంత్రం నిర్వహించిన సంగీత విభావరిలో స్థానిక కళాకారులు మత్సుర్తి రామారావు, ఉపాధ్యాయుడు నాగేశ్వరావు, ఆర్‌వీ ఆంజనేయులు, సాంబశివరావు తదితరులు ఆలపించిన గీతాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. అనకాపల్లికి చెందిన ఈల పాట కళాకారుడు తన ఈల పాటతో ఆద్యంతం అందరినీ అలరించారు. ఈ సందర్భంగా ఆయనను, స్థానిక చార్టెర్డ్ అక్కౌంటెంట్ బీఎస్ బంగారుశెట్టిలను ఘనంగా సత్కరించారు. అంతకు ముందుకు ఘంటసాల చిత్రపటానికి చైర్‌పర్సన్ రమాకుమారి, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, కమిటీ ప్రతినిధులు, సభ్యులు ఆడారి పూరి జగన్నాధం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో వీఎస్ఎస్ శర్మ(ప్రథమ), జి.భవానీ(ద్వితీయ), కె.జగదీశ్వరి(తృతీయ)స్థానాలను కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో సీహెచ్ పవిత్ర(ప్రథమ), ఎం.మణిదీప్(ద్వితీయ), కె.దివ్యశ్రీ(తృతీయ)స్థానాలకు దక్కించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రామారావు, సత్యనారాయణ, పవన్‌లు వ్యవహరించారు.

దిశ మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఉపేంద్రబాబు బాధ్యతల స్వీకారం



డీఎస్పీ ఉపేంద్రబాబు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11: అనకాపల్లి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ఎం.ఉపేంద్రబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు సీసీఎస్ సీఐగా పనిచేసిన ఆయనకు ప్రభుత్వం డీఎస్పీగా పదోన్నతి ఇచ్చి దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఎం.మహేశ్వరరావు అమలాపురానికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ మహిళా చట్టాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

'ఎన్నికల్లో మత్స్యకారులకు టికెట్లు కేటాయించాలి'



నక్కపల్లిలో సమావేశమైన ఆంధ్ర మత్స్యకార జేఏసీ సభ్యులు

నక్కపల్లి, ఫిబ్రవరి 11 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు ఎక్కువ మంది మత్స్యకారులకు ప్రధాన రాజకీయ పార్టీలు టికెట్లు ఇచ్చి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్ర మత్స్యకార జేఏసీ సంఘం తీర్మానించింది. ఈ మేరకు ఆదివారం స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఏపీలో 30 లక్షల జనాభా ఉన్న మత్స్యకారులకు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, జీఓ నం.217ను రద్దు చేయాలన్నారు. అదే విధంగా తగిన గుర్తింపునివ్వాలని, లేకుంటే ఆయా పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. సంఘం నాయకులు అర్జిల్లి అప్పలరాజు, చోడిపిల్లి వెంకటేశ్, జి.నూకరాజు, పి.లోకనాథం, ప్రశాంత్, రాజేశ్, శ్రీను, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మేలు జరగాలంటే టీడీపీ ప్రభుత్వం రావలసిందే..

- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత



దివ్యాంగుడితో మాట్లాడుతున్న అనిత

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 11: రాష్ట్రానికి మేలు జరగాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె పర్యటించి, పల్లె పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను, కష్టాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచారు. వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు, రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని, ప్రజలకు, రాష్ట్రానికి మంచి జరగాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని అనిత పిలుపునిచ్చారు. గ్రామానికి విచ్చేసిన అనితకు మహిళలు హారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కందుల వెంకటేశ్వరరావు, తుంపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, వజ్రపు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్యకేసు దర్యాప్తుపై ఉన్నతస్థాయి ఒత్తిళ్లు!

- కస్టడీలో నిందితుడు గంగారావు వెల్లడించిన అంశాలపైనా గోప్యత
- తెరవెనుక సూత్రధారులు తప్పించుకున్నట్టేనని ప్రచారం
- పోలీసుల తీరుపై రెవెన్యూ ఉద్యోగుల్లో అనుమానం!

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తహసీల్దార్ రమణయ్య హత్య కేసు దర్యాప్తుపై పోలీసులకు ఉన్నతస్థాయి నుంచి ఒత్తిళ్లు పెరిగినట్టు ప్రచారం జరుగుతోంది. విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్యకు విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ కావడం, అక్కడ బాధ్యతలు స్వీకరించి ఇంటికి చేరుకున్న అతడ్ని రాత్రి పది గంటల సమయంలో మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు ఇనుపరాడ్‌తో తలపై మోది హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన మరుసటిరోజే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించగా, వారి అభ్యర్థన మేరకు కోర్టు కస్టడీకి అనుమతించింది.

పోలీసులు గంగారావును పట్టుకున్న ఒకరోజు వ్యవధిలోనే అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపడంతో వివరాలను రాబట్టడానికి అవకాశం లేదనుకున్నా... తర్వాత నాలుగు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఇప్పటికే మూడు రోజులు గడిచిపోయాయి. డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఏసీపీ, సీఐ మరికొంతమంది సిబ్బంది గంగారావును విచారిస్తున్నారు. సీపీ రవిశంకర్ అయ్యనార్ కూడా శనివారం పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విచారణ జరుగుతున్న తీరును పరిశీలించారు. అయితే ఇంతవరకూ పోలీసులు సేకరించిన సమాచారం బయటకు చెప్పకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతేకాకుండా విచారణలో వెల్లడించిన అంశాలేవీ బయటకు తెలియడానికి వీల్లేదని, ఒకవేళ లీక్ అయితే బాధ్యులపై తీవ్ర చర్యలు ఉంటాయని ఉన్నతాధికారులు హెచ్చరించడంతో సిబ్బంది విచారణ జరుగుతున్న గదివైపు వెళ్లడానికి కూడా భయపడిపోతున్నారని సమాచారం.

తెరవెనుక సూత్రధారులెవరు?

పెదరుషికొండలోని సర్వేనంబరు 380/1లోని కొంతభాగంలో నిర్మించిన అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన స్థలానికి కన్వేయెన్స్‌డీడ్ జారీ విషయమే హత్యకు దారితీసిందని పోలీసులు ప్రకటించారు. గంగారావు ఒక రియల్‌ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ వెల్లడించారు. దీనిని బట్టి గంగారావుకు వ్యక్తిగతంగా తహసీల్దార్‌తో ఎలాంటి లావాదేవీలు నిర్వహించాల్సిన అవసరం లేదని ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. అయితే గంగారావు ఎవరి కోసం కన్వేయెన్స్‌డీడ్ జారీకి తహసీల్దార్‌ను సంప్రదించాడనేది తేలాల్సి ఉంది. అలాగే కన్వేయెన్స్‌డీడ్ జారీ కోసం గంగారావు తహసీల్దార్‌కు భారీగా డబ్బులు ముట్టజెప్పాడని ప్రచారం జరుగుతోంది. అది వాస్తవమైతే అంతమొత్తం గంగారావుకు ఆ డబ్బు ఎవరు ఇచ్చారనేది తేలాల్సి ఉంటుంది. మరోవైపు రమణయ్యకు విజయనగరం జిల్లాకు బదిలీ అయిపోవడంతో ఇంక పని జరగదనే ఆక్రోశంతో గంగారావుకు డబ్బులు సమకూర్చినవారే తహసీల్దార్‌ను హత్య చేయాలనో... దాడి చేసి బెదిరించాలనో.. ప్రోత్సహించే అవకాశం ఉందంటున్నారు. వీటన్నింటిపైనా పోలీసులు దృష్టిపెడితే ఒక్క రోజులోనే వాస్తవాలు బయటపడతాయని భావిస్తున్నారు.

ఉన్నత స్థాయిలో ఒత్తిడి

రుషికొండలోని తారకరామ లేఅవుట్ ప్రాంతంలోని సుమారు 50 ఎకరాల భూమిని వీఎంఆర్‌డీఏ ఒక సంస్థకు కేటాయించింది. ఆ భూమి పలువురి చేతులు మారి ప్రస్తుతం అధికారపార్టీలోని కీలకనేత బంధువు ఆధీనంలోకి వెళ్లింది. ఆ భూముల్లో నిర్మాణాలు ప్రారంభించిన ఆ కీలకనేత బంధువు నిర్మాణ బాధ్యతలను ప్రస్తుతం గంగారావు పనిచేస్తున్న సంస్థకు అప్పగించినట్టు సమాచారం. నిర్మాణ పనులు జరుగుతుండగానే ఆ భూములు మరోసారి అధికారపార్టీకి చెందిన రాయలసీమ నేత చేతుల్లోకి వెళ్లిపోవడంతో బాధ్యతల నుంచి గంగారావు పనిచేస్తున్న సంస్థను తప్పించారు. తాజాగా తహసీల్దార్ రమణయ్య హత్య నేపథ్యంలో హత్యకు పాల్పడిన గంగారావుతోపాటు తనను కూడా పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో గంగారావు పనిచేస్తున్న సంస్థ యజమాని గతంలో అధికారపార్టీకి చెందిన కీలకనేత బంధువును సంప్రదించినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ కీలకనేత బంధువు పోలీస్ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయడం వల్లే కేసు దర్యాప్తులో వేగం తగ్గినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసును కొంతకాలం నాన్చిన తర్వాత గంగారావు ఒక్కడే నిందితుడని, హత్య వెనుక మరెవరి ప్రమేయం, ప్రోత్సాహం లేదని పోలీసులు ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదని పలువురు రెవెన్యూ శాఖ ఉద్యోగులే అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రెవెన్యూ ఉద్యోగుల పెన్‌డౌన్

- తహసీల్దారు హత్యపై ప్రభుత్వ స్పందన శూన్యమని ఆవేదన

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య హత్య జరిగి పదిరోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోకపోడంపై రెవెన్యూ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆదివారం విశాలాక్షినగర్‌లో నిర్వహించిన రెవెన్యూ హౌస్ బిల్డింగ్ సొసైటీ సాధారణ సమావేశంలో రమణయ్య హత్యపై సభ్యులు చర్చించారు. తహసీల్దారు హత్యకు గురైన తరువాత రెవెన్యూ ఉద్యోగులు ధైర్యంగా విధులు నిర్వహించలేకపోతున్నారని, ప్రభుత్వ ఆస్తులు కాపాడేందుకు వెనుకాడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రమణయ్య హత్యను ఖండిస్తూ, ఆయన కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాతోపాటు అతని సతీమణికి గ్రూప్-2 ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రమణయ్య హత్య పై ప్రభుత్వం స్పందించే వరకు సహాయ నిరాకరణ చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి పెన్‌డౌన్ చేసేందుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

రెవెన్యూ ఉద్యోగుల సొసైటీ అధ్యక్షుడు కృష్ణకిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి విశాఖ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బెహరా రవిశంకర్, ఎన్జీవో సంఘం నగర కార్యదర్శి సత్యనారాయణ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, రిటైర్డు రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం.మధుసూదనరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రెవెన్యూ సంఘ ప్రతినిధులు

340 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 11: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 120వ నేత్ర వైద్య శిబిరంలో 340 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 242 మందికి ఉచితంగా కంటి అద్దాలను బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి అందజేశారు. 116 మందికి ఉచితంగా మందులు ఇచ్చారు. 30 మందికి కాటరాక్ట్ సర్జరీలు చేయాలని వైద్యాధికారులు నిర్ధారించారు. వీరికి విశాఖలో గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. అలాగే ఆదివారం వైద్య శిబిరానికి హాజరైన వారందరికీ ఉదయం ఫలహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాలు ఏర్పాటుచేశామన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 11: పట్టణంలోని జగతా శేషయ్యనగర్ రోడ్డులో సీసీ డ్రైనేజీ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ డ్రైనేజీ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' పలు పర్యాయాలు వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు సమస్యను గుర్తించిన పంచాయతీ పాలకవర్గం, అధికారులు జగతా శేషయ్యనగర్‌రోడ్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.26 లక్షలు విడుదల చేయడంతో ఆదివారం పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, వైసీపీ నాయకులు గారా ప్రసాద్, జగతా శ్రీనివాస్, ఇసరపు తాతారావు, వార్డు సభ్యుడు పిరాది రాజు, గుల్లా నాగరాజు పాల్గొన్నారు.

18న ఫ్యాషన్ గార్మెంట్ కోర్సులకు ప్రవేశ పరీక్షలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 11: ఈనెల 18న తమ కళాశాలలో ఫ్యాషన్, గార్మెంట్ కోర్సులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రశాంతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలం అప్పలనాయుడు తెలిపారు. బ్రాండిక్స్ అపెరల్ ఇండియా సహకారంతో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు పదో తరగతి ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు అర్హులన్నారు. రెండేళ్ల కాల వ్యవధి గల ఈ కోర్సుకు 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఫీజులో 50 శాతం రాయితీ ఉందన్నారు. జాబ్ ఓరియంటెడ్ కోర్సు కావడం వల్ల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తమలపాకుల అలంకరణలో శ్యామా అమ్మవారు



తమలపాకులతో అలంకరించిన శ్యామా అమ్మవారు

సబ్బవరం, ఫిబ్రవరి 11 : మండలంలోని దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని తమలపాకులతో అలంకరించి పూజలు నిర్వహించారు. తమలపాకులతో పూజలు నిర్వహిస్తే సకల అరిష్టాలు నశిస్తాయని ప్రతీతి అని అన్నపూర్ణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన పంచా మృతాలతో అభిషేకాలు, రాజశ్యామల హోమ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కందర్ప ప్రభాకర్, రమా పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు



సత్యవరం వద్ద ఉదయం 7 గంటలకు కురుస్తున్న పొగమంచు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి11 : మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. ఉదయం 7 గంటలు అయినా పొగమంచు కురుస్తూనే ఉంది. వేకువజామున పొగమంచు వలన రోడ్డుపై ఎదురెదురు వాహనాలు కనిపించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు వలన జీడిమామిడి పూతలు మాడిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జనసేనలో పలువురి చేరిక



జనసేన పార్టీలో చేరిన యువకులు

మునగపాక, ఫిబ్రవరి 11: మండలంలో మునగపాక, మడకపాలెం గ్రామాలకు చెందిన 30 మంది యువకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానం పలికారు. సమావేశంలో మునగపాక గ్రామ ప్రధాన కార్యదర్శిగా దొడ్డి మహేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాం, పార్టీ నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, కె.చంద్రమోహన్, ఆడారి శ్రీకాంత్, సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచ్చిదానందస్వామిజీని కలిసిన పీలా



స్వామిజీతో మాట్లాడుతున్న పీలా గోవింద

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 11 : జీవీఎంసీ 84వ వార్డు పరిధిలోని సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రాన్ని ఆదివారం సచ్చిదానంద స్వామిజీ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామిజీని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం చింతామణి గణపతికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదంశెట్టి నీలబాబు పాల్గొన్నారు.

మామిడి రైతుకు కష్టాలు

- రాలిపోతున్న పూత
- ఆపై మాడు తెగులు
- ఫిబ్రవరి వచ్చినా మొగ్గ కట్టని వైనం
- దిగుబడిపై ఆశలు వదులుకున్న రైతులు



తంగేడులో పూతరాని మామిడి తోట

కోటవురట్ల, ఫిబ్రవరి 11: మామిడి రైతులకు ఈ ఏడాది పూత దశలోనే కష్టాలు మొదలయ్యాయి. సాధారణంగా డిసెంబరు నెలలోనే పూతతో నిండుగా కనిపించే మామిడి తోటలు ఈఏడాది జనవరి పూర్తయినా సగానికి పైగా చెట్లు మొగ్గ కూడా కట్టకపోవడంతో దిగుబడిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. వచ్చిన పూత రాలిపోవడం, ఉన్న పూతకు మాడు తెగులు సోకడంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. దీంతో దిగుబడిపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. గతంలో పిందెదశలోనే తోటలు కొనేందుకు ఆసక్తి చూపే వ్యాపారులు ఈసారి పూత లేటవడం, కాపు ఎంత వరకూ నిలబడుతుందో తెలియక ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. పూత ఆలస్యమవడంతో దిగుబడి, కాయ నాణ్యత అంచనా వేయలేమని వారు చెబుతున్నారు. ఇదే కొనసాగితే పూర్తిగా నష్టపోతామని వారంటున్నారు. గత ఏడాది కాయలకు తెగుళ్లు సోకి రైతులకుపెట్టుబడులు రాలేదు. మండలంలో అల్లుమియాపాలెం, కొడవటిపూడి, పందూరు, గొట్టివాడ, అణుకు, టి.జగ్గంపేట, కోటవురట్ల, వీకేపల్లి, బోడపాలెం, నీలిగుంట గ్రామాల్లో రైతులు ఎక్కువగా మామిడి సాగు చేస్తున్నారు. మండలంలో 2 వేల ఎకరాల్లో సాగు ఉంటుంది. ఈ పరిస్థితిపై ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మామిడిలో పూతకు ముందు, పూత సమయంలో అనేక రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి పంటకు నష్టం కలిగిస్తాయన్నారు. సరైన నీటి, పోషకాల యాజమాన్యం చేపట్టకపోతే పిందెలు ఎక్కువగా పడిపోతాయన్నారు. పూత నిలబడడానికి అవసరమైన మందులను రైతులు పిచికారీ చేయడం వల్ల ఫలితాలు వస్తాయన్నారు.

బీసీల సత్తా ఏమిటో చూపించాలి



అనకాపల్లి సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్



అచ్యుతాపురం సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

- టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11 : రాబోయే రెండు నెలల్లో జరగబోయే ఎన్నికల్లో బీసీల సత్తా ఏమిటో చూపించాలని టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక ఒక హోటల్‌లో ఆదివారం ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మొల్లి రమణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలిగా పెదపాటి కల్యాణిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే పలువురు యువత కమిటీ ప్రతినిధులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రత్నాకర్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగ అనుసరించి పేరుకే పదవులు ఇవ్వడం తప్ప ఎటువంటి ప్రాధాన్యత లేదన్నారు. ఈ విధానంలో మార్పు రావాలంటే ఎన్నికల్లో బీసీల సత్తా చూపించాలన్నారు. బీసీలు కేవలం ఓటు బ్యాంక్ కోసం మాత్రమే కాకుండా అభివృద్ధి, అధికారాల్లో భాగం పంచుకునే విధంగా చేయవలసి అవసరం ఉందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వంలో 56 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారని కేవలం పేరుకే ఏర్పాటు చేశారన్నారు. వాటివల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం కలగలేదన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నాలుగు దఫాలు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వహించి ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. సమావేశంలో కూండ్రపు కృష్ణనాయుడు, వియ్యపు సన్యాసిరావు, కూర్మారావు, ఎం. అప్పారావు, పి. శంకర్, జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

బీసీలకు మోసం చేసిన జగన్ రెడ్డి : ప్రగడ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 11: జగన్ రెడ్డి కార్పొరేషన్ పేరుతో బీసీలకు మోసం చేశాడని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అచ్యుతాపురంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేరుకే బీసీ కార్పొరేషన్ అని, దానికి నిధులు, అధికారాలు లేవన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలు వివక్షకు గురవడమే కాకుండా దాడులకు కూడా గురయ్యారన్నారు. ఎన్నికల ముందు కుల గణన పేరులో మభ్యపెడుతోందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే తప్ప బీసీలు మనుగడ సాగించలేరన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ అధ్యక్షత వహించిన ఈకార్యక్రమలో జనపరెడ్డి నరసింగరావు, దూళి రంగనాయకులు, మేరుగు బాపునాయుడు, పుర్రే శ్రీనివాస యాదవ్, కాళ్ల రాజు, కర్రి రమణ, లాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి రాజకీయ ప్రయోజనం కోసమే దళితవాడ సాధన సంకల్ప సభ

- డీబీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్



మాట్లాడుతున్న డీబీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్

పాయకరావుపేట, ఫిబ్రవరి 11 : ఏఐఎం చీఫ్ పీవీ.సునీల్‌కుమార్ జగన్‌రెడ్డి రాజకీయ ప్రయోజనం కోసమే దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభ పెట్టారని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితవాడ పంచాయతీల కంటే దళిత సీఎం సాధన ద్వారానే దళితజాతి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీఎం పదవిని దళిత జాతి హస్తగతం చేసుకోకుండా.. జగన్‌రెడ్డిని సీఎంను చేయడానికి పీవీ.సునీల్‌కుమార్ పనిచేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాధికారం ఉద్యమాన్ని దళితులు చేపట్టకుండా.. పంచాయతీల వరకే పరిమితం చేసే రాజకీయ కుట్ర దాగి ఉన్నదని విమర్శించారు. సునీల్‌కుమార్ వైసీపీకి మద్దతుగా పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. దళితవాడల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ఉండాలేగాని ప్రత్యేక పంచాయతీలతో విముక్తి కాదన్నారు. గతంలో గుంటూరు జిల్లా చుండూరులో ప్రభుత్వం ఏర్పాటుచేసిన దళితవాడ పంచాయతీ అభివృద్ధికి నోచుకోక దయనీయ పరిస్థితిలో ఉందన్నారు. దళితజాతిని రాష్ట్ర పాలకులుగా తయారుచేయాలే తప్ప పంచాయతీలకే పరిమితం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో డీబీపీ రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, తోకల మునలయ్య, ముకేశ్, రాజాల నాగబాబు, జేసీ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు

... 5వ పేజీ తరువాయి

నివాసం ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నగరానికి వచ్చే నాటికి మద్యం అలవాటు ఉంది. ప్రతిరోజూ పనికి వెళ్లి వచ్చిన తరువాత ఒక సీసా కొనుగోలు చేసి ఇంటికి వచ్చి తాగి, తిని పడుకునేవాడు. మిగిలిన మొత్తాన్ని భార్యకు ఇచ్చేవాడు. కానీ, గడిచిన మూడున్నరేళ్ల నుంచి మద్యానికి పూర్తిగా బానిసగా మారాడు. ఉదయాన్నే పనికి వెళ్లడం, రాత్రికి ఎప్పుడో పూటుగా తాగి ఇంటికి రావడం పరిపాటిగా మారింది. ఒక్కోరోజు ఇంటికి కూడా రాకుండా ఆ షాపు బయట నిద్రపోతున్నాడు. పదేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలతో అతడి భార్య బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తోంది. ఏం చేయాలో, ఎవరికి చెప్పాలో కూడా తెలియక తీవ్రంగా మథనపడుతోంది. కుటుంబ సభ్యులు చెప్పినా అతడిలో మార్పు రాలేదు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విక్రయిస్తున్న మద్యం కిక్ ఇవ్వడం లేదని, తాగుతున్న ఫీలింగ్ రాకపోవడం వల్లే ఇంకా తాగాలనిపిస్తోందని హెచ్‌బీ కాలనీలో ఉంటూ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న రవి తెలిపాడు. గతంలో బీర్ తాగే అలవాటు ఉండేదని, ఇప్పుడు అన్నింటికీ అలవాటు పడిపోయానని, బయట పడేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నట్టు ఆవేదన వ్యక్తంచేశాడు. ఇటువంటి వాళ్ల సంఖ్య గడిచిన కొద్దికాలంగా పెరిగింది. ఆదాయంలో సగానికి మించి, పూర్తిగా కూడా మందుకే ఖర్చు పెడుతున్న వారి సంఖ్య పెరిగింది. రోజువారీ కూలికి వెళ్లి ఆదాయం తెచ్చుకునే ఎంతోమంది కుటుంబాల్లో ఇదే పరిస్థితి ఉంది. రోజు కూలికి వెళితే ఐదు వందలు నుంచి ఏడు వందల రూపాయల వరకు వస్తే..అందులో మూడు, నాలుగు వందలు మద్యానికే ఖర్చు చేసేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

తాగాలనిపిస్తుండడం వల్లే...

ఈ మధ్య కాలంలో తాగుడుకు బానిసలుగా మారిన వారి సంఖ్య పెరుగుతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు. గతంలో కాస్తో, కూస్తో తాగేవారని, ఇప్పుడు పరిధికి మించి తాగుతూ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారంటూ మద్యానికి బానిసైన వారిని కుటుంబ సభ్యులు మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళుతున్నారు. ప్రతి పది కేసుల్లో కనీసం నాలుగు అవే ఉంటున్నాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎన్ఎన్ నిహాల్ తెలిపారు. కొంతమంది ఉదయం మొదలుపెట్టి రాత్రి పడుకునేంత వరకు తాగుతూనే ఉంటున్నారని, అటువంటి వారికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని ఆయన వెల్లడించారు.

మళ్లీ భూ యజ్ఞం!

... 5వ పేజీ తరువాయి

ఆదేశించింది. అయితే ఈ విచారణ నివేదికను కూడా అధికారులు ఇంతవరకు వెల్లడించలేదు. లోకాయుక్తకు పూర్తి వివరాలు పంపామని స్థానిక రెవెన్యూ అధికారులు చెబుతున్నా, ఆ నివేదికలో వివరాలు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు.

మళ్లీ పనులు మొదలు

విస్సన్నపేట భూములపై లోకాయుక్త కోర్టులో కేసు విచారణలో ఉండగా.. అక్రమార్కులు మళ్లీ భూముల్లోకి వచ్చి రియల్ ఎస్టేట్ వెంచర్ పనులు జోరుగా సాగిస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో ఎత్తుపల్లాలను సరిచేస్తున్నారు. కొండవాలు ప్రాంతం నుంచి రంగబోలు గెడ్డకు వర్షపు నీరు ప్రవహించే గోర్జిలను కప్పేసి, గ్రావెల్‌తో చదును చేస్తున్నారు. విస్సన్నపేటలో 3.7 ఎకరాల డి.పట్టా భూములు ఉన్నట్టు గతంలో రెవెన్యూ అధికారులు తేల్చి ఒక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డు కనిపించడంలేదు. వారం రోజుల నుంచి పనులు జరుగుతున్నప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి అయినా చూడడంలేదు. ఇదిలా ఉండగా విస్సన్నపేట భూములపై లోకాయుక్తలో కేసు విచారణలో ఉండగా లేఅవుట్ పనులు ఏ విధంగా చేస్తున్నారో అర్థం కావడం లేదని, దీనిపై మరోసారి లోకాయుక్త, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని జనసేన అధికార ప్రతినిధి దూలం గోపి తెలిపారు.

జనసేన మరింత బలోపేతానికి కృషిచేయాలి

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి



సమావేశంలో మాట్లాడుతున్న గెడ్డం బుజ్జి

నక్కపల్లి, ఫిబ్రవరి 11 : జనసేన పార్టీ కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి పార్టీని మరింత బలోపేతానికి జనసైనికులు కృషిచేయాలని ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని డొంకాడలో నిర్వహించిన జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, బొల్లిశెట్టి సత్య, గడసాల అప్పారావు, పార్టీ నాయకులు యగదాసి నానాజీ, వెలగా సుధాకర్, సింగపల్లి శ్రీను, పప్పల శివ, డొంకాడ గ్రామ అధ్యక్షుడు చందిన గోవిందు పాల్గొన్నారు.

ఉపమాకలో ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని ఉపమాకలోని దుర్గాదేవి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అధిక సంఖ్యలో మహిళలు పసుపు కుంకుమ సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం దాతల సాయంతో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొని సేవలందించారు. అదేవిధంగా చందనాడలో ఆదివారం దుర్గాదేవి అమ్మవారి బోనాల ఊరేగింపు ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు గ్రామ వీధుల్లో బోనాలు ఊరేగించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, తళ్లా అప్పలస్వామి, సర్పంచ్ తళ్లా రోహిణి, గంటా తిరుపతిరావు అమ్మవారిని దర్శించుకున్నారు.


దీన్ దయాల్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్ దయాల్ ఉపాధ్యాయకు నివాళులర్పిస్తున్న నేతలు

కొత్తూరు, ఫిబ్రవరి 11 : బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఇక్కడి బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొని ఏకాత్మత మానవత సిద్ధాంతాన్ని వివరించారు. అనంతరం పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, వి.రమేష్, భక్తసాయిరాం, ప్రభాకర్, నర్సింగ్ యాదవ్, శేషగిరి పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఫ్లైఓవర్ పనులు పునఃప్రారంభం



కొక్కిరాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కొనసాగుతున్న పనులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 11: ఎలమంచిలి కొక్కిరాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఈ పనులు తిరిగి ప్రారంభించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ బ్రిడ్జి నిర్మాణానికి 35 కోట్ల వ్యయంతో 2009వ సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. 14 సంవత్సరాలు కావస్తున్నా సరే బ్రిడ్జి మాత్రం పూర్తి దశకు చేరుకోకపోవడంతో నియోజకవర్గ ప్రజలకు తీవ్ర సమస్యగా మారింది. ఈ బ్రిడ్జిని పూర్తి చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఎట్టకేలకు ప్రారంభమైన బ్రిడ్జి పనులు ఎన్నికలకు ముందైనా పూర్తి చేస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11 : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. పట్టణ పురవీధుల్లో అమ్మవారి నామ సంకీర్తనతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. గోపూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండపంలో 102 వెండి ప్రమిదలతో అమ్మవారికి దీపారాధన చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు, ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

- ఉప ముఖ్యమంత్రికి యూటీఎఫ్ వినతి



బూడికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11: ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలుపరిచే విధంగా సహకారమందించాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు ఆదివారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఓపీఎస్‌ను అమలు చేసి ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్టు యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు వత్సవాయి శ్రీలక్ష్మి, డి.శ్రీను, కె.కామరాజు, బి.రామచంద్రరావు పాల్గొన్నారు.

నిరంతర యోగాతోనే ఆరోగ్యం

- పతంజలి యోగా సమితి అధ్యక్షురాలు ప్రభసాహూ



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రభసాహూ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 11: నిరంతరం యోగాతోనే ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగా సమితి అధ్యక్షురాలు ప్రభసాహూ పేర్కొన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు బీశెట్టి దొరమ్మనాయుడు ఆధ్వర్యంలో జరిగిన నాలుగురోజుల యోగా శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యధిక సమస్యల పరిష్కారానికి సూర్య నమస్కారాల సాధన మంచిదన్నారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జార్జిక్లబ్ అధ్యక్షుడు బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, కాండ్రేగుల చిన్న, భీమరశెట్టి శ్రీనివాసరావు, కోలపర్తి కన్నబాబు, ఏ. రామకృష్ణ, కొణతాల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విజయం చిన్నదైనా స్ఫూర్తి ఉజ్వలం

- శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీహెచ్.విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, ఫిబ్రవరి 11 : విద్యార్థి విజయం చిన్నదైనా స్ఫూర్తి ఉజ్వలంగా ఉంటుందని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అన్నారు. ఆదివారం పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో ఏర్పాటుచేసిన అభినందన సభలో విద్యా, ఆటపాటలు, పోటీ పరీక్షల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిలో ప్రతిభ కనబర్చిన 900 మంది విద్యార్థులను సీహెచ్.విజయ్‌ప్రకాష్ అభినందించి, బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థి దశ నుంచి విజయకాంక్ష ఉంటుందని, విద్యార్థికి విద్యలోనే కాకుండా ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేందుకు తగిన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువగళం ట్రోఫీ ఆవిష్కరణ



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, ఫిబ్రవరి 11 : మాజీ ఎంపీ దివంగత పెతకంశెట్టి అప్పలనరసింహం 88వ జయంతిని పురస్కరించుకుని నారా లోకేష్ యువగళం విజయోత్సవ ట్రోఫీని ఆదివారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. నాగులాపల్లి పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రోఫీని ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 17 నుంచి 19 వ తేదీ వరకూ రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. పెతకంశెట్టి స్వగ్రామం నాగులాపల్లిలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు తమ వంతు సహకారం తప్పకుండా అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల రాజేష్, శరగడం యోగి నాగేశ్వరరావు, పొలమరశెట్టి మురళీ, నాగు, గోసాల గోవింద, పి. రాజునాయుడు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలలో మానవహారాలు

మునగపాక, ఫిబ్రవరి 11: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ పలు గ్రామాలలో మానవహారాలు నిర్వహిస్తామనిఇ రోడ్డు నిర్మాణ పోరాట కమిటీ తెలిపింది. నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక, తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, అచ్యుతాపురం గ్రామాలలో పోరాట కమిటీ గ్రామస్థులతో కలసి మానవహారాలు జరుగుతాయని తెలిపారు. ఆయా సమయాలలో రాకపోకలకు అంతరాయం కలిగినప్పటికీ ప్రజలంతా సహకరించాలని వారు కోరారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభం



చిన్నయ్యపాలెంలో అంజనేయస్వామి ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్

మాకవరపాలెం, ఫిబ్రవరి 11: మండలంలో బీఎస్‌పేటలో ఆంజనేయస్వామి ఆలయాన్ని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆదివారం ప్రారంభించారు. ఈ ఆలయాన్ని రూ.10లక్షల టీటీడీ నిధులతో నిర్మించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 22 ఆలయాలలకు టీటీడీ నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ శివరామ కృష్ణ, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగేశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు రుత్తల వాసు, రమణ, గోవింద పాల్గొన్నారు.

సత్యసాయి భజనమండలి సభ్యుల నియామకం

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 1 : గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలోని సత్యసాయిబాబా భజనమండలి సభ్యులను ఆదివారం నియమించారు. స్థానిక భజనమండలి కన్వీనర్‌గా వెచ్చం శివకుమార్, జాయింట్ కన్వీనర్లుగా శివకుమార్, వినుకోటి కిరణ్, టెంకా లోవరాజులను నియమించినట్టు సత్యసాయిసేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు శ్రీకృష్ణంరాజు తెలిపారు.

ఘనంగా రామాలయం వార్షికోత్సవం



రావణాపల్లిలో రామాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

గొలుగొండ, ఫిబ్రవరి 11: మండలంలో రావణాపల్లి సీతారాముల ఆలయ మూడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్



సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

మాకవరపాలెం, ఫిబ్రవరి 11: అరాచక పాలనకు చరమగీతం పాడాలని, టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం మాకవరపాలెంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఈ గ్రామంలో వైసీపీ నాయకులు చేసిన భూకబ్జాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. పేదల భూములు కబ్జా చేసి వాటిని అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ల్యాండ్ సీలింగ్ భూముల తోపాటు గెడ్డ పోరంబోకు భూములను కబ్జా చేశారని, టీడీపీ ప్రభుత్వం రాగానే వాటిని అన్నింటిని లాక్కుకొని పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామన్నారు. అలాగే తార సంస్థ వద్ద ఉన్న 30సెంట్లు స్థలాన్ని పంచాయతీ స్వాధీనం చేసుకొని కల్యాణ మండపాన్ని నిర్మిస్తామన్నారు. గ్రామంలో టీడీపీ ప్రభుత్వంలో రూ. ఆరు కోట్లతో అభివృద్ధి చేశామని, వైసీపీ నేతలు ఎక్కడైనా అభివృద్ధి చేశారని ఆయన ప్రశ్నించారు. ఉన్న రోడ్లను పాడుచేసి చుక్కనీరు కూడా ఇవ్వలేదన్నారు. అలాగే మరో నెల రోజులు టీడీపీ,జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని, దీనిని ప్రజలు గమనించాలన్నారు. ఇసుక దందాలు, మట్టి దందాలు, భూదందాలు చేస్తున్న వైసీపీ నాయకులకు రాబోయే రోజుల్లో చుక్కలు చూపిస్తామన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ,జనసేన పార్టీలను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లంపల్లి శిరీష, ఉప సర్పంచ్ లాలం రాము, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, టీడీపీ జడ్పీటీసీ మాజీ సభ్యుడు రుత్తల శేషకుమార్, సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు, కేతిరెడ్డి చిరంజీవి, గోవింద, చింతల శర్మ, జనసేన మండల అధ్యక్షుడు సేనాపతి శేషు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వానరాల బెడద

» పంటలను నాశనం చేస్తున్న కోతులు
» ఆందోళన చెందుతున్న రైతులు
» పట్టించుకోని అధికారులు, పాలకులు



కొమరవోలులో చోడి చేనును నాశనం చేస్తున్న కోతులు

రోలుగుంట, ఫిబ్రవరి 11: మండలంలోని పంట పొలాలపై వందలు, వేలు కోతుల గుంపులు దండయాత్ర చేస్తున్నాయి. కొండకోనల్లో తిరుగాడే వానరాలు నేడు పల్లెల్లో రైతులకుకంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రైతుల పంట చేలపై దాడి చేసి నాశనం చేయడంతోపాటు విధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

మండలంలోని కొమరవోలు, రోలుగుంట, జగ్గంపేట, కుసర్లపూడి, జానకిరాంపురం, పడాలపాలెం, ఎల్.కొత్తూరు, రొంగలిపాలెం తదితర గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. కొండ కోనల్లో గ్రాసం కరువై కడుపు నింపుకోవడానికి జనారణ్యంపై పడ్డాయి. చెరకు, ఉలవ, పెసర, కంది, గంటి, చోడి, కొబ్బరి, బొప్పాయి, కూరగాయాల పంటలపై కోతులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. కొన్ని పంటలను తింటున్నారు. గత నాలుగేళ్లుగా వానర సేన శివారుల్లోని తోటల్లో ఉంటూ పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. దీంతో రైతులు పంటలను సాగు చేయకుండా భూములను ఖాళీగా వదిలేసి కూలి పనులకు వెళ్లిపోతున్నారు. గ్రామాల్లోని ఇళ్ల వద్దకు వచ్చి అన్నం, పప్పు దినుసులు, ఆహార పదార్థాలను ఎత్తుకుపోతున్నాయి. అంతేకాక రోడ్లపై గుంపులు గుంపులుగా ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఐదేళ్లగా పంట పొలాలకు నష్టం చేకూర్చుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు, ప్రజలు వాపోతున్నారు. అలాగే ప్రజాప్రతినిదులు కూడా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. కోతులను పట్టుకోవడానికి అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణాదేవిపేటలో ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 11 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నుంచి సీసీ కెమెరాల మధ్య ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. కళాశాలలో చదువుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 78 మంది ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నారు. ప్రతీరోజు ఉదయం 20 మంది, మధ్యాహ్నం 20 మందికి ప్రాక్టికల్స్ జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు తెలిపారు. ప్రాక్టికల్స్ పరివేక్షణకు నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల బొటనీ అధ్యాపకురాలు ప్రియదర్శిని నియమించారన్నారు. ఎటువంటి మాస్‌కాపీంగ్ జరగకుండా గట్టి నిఘా మధ్య ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గంగరాజు తెలిపారు.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు

... 5వ పేజీ తరువాయి

నివాసం ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నగరానికి వచ్చే నాటికి మద్యం అలవాటు ఉంది. ప్రతిరోజూ పనికి వెళ్లి వచ్చిన తరువాత ఒక సీసా కొనుగోలు చేసి ఇంటికి వచ్చి తాగి, తిని పడుకునేవాడు. మిగిలిన మొత్తాన్ని భార్యకు ఇచ్చేవాడు. కానీ, గడిచిన మూడున్నరేళ్ల నుంచి మద్యానికి పూర్తిగా బానిసగా మారాడు. ఉదయాన్నే పనికి వెళ్లడం, రాత్రికి ఎప్పుడో ఫూటుగా తాగి ఇంటికి రావడం పరిపాటిగా మారింది. ఒక్కోరోజు ఇంటికి కూడా రాకుండా ఆ షాపు బయట నిద్రపోతున్నాడు. పదేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలతో అతడి భార్య బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తోంది. ఏం చేయాలో, ఎవరికి చెప్పాలో కూడా తెలియక తీవ్రంగా మథనపడుతోంది. కుటుంబ సభ్యులు చెప్పినా అతడిలో మార్పు రాలేదు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విక్రయిస్తున్న మద్యం కిక్ ఇవ్వడం లేదని, తాగుతున్న ఫీలింగ్ రాకపోవడం వల్లే ఇంకా తాగాలనిపిస్తోందని హెచ్‌బీ కాలనీలో ఉంటూ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న రవి తెలిపాడు. గతంలో బీర్ తాగే అలవాటు ఉండేదని, ఇప్పుడు అన్నింటికీ అలవాటు పడిపోయానని, బయట పడేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నట్టు ఆవేదన వ్యక్తంచేశాడు. ఇటువంటి వాళ్ల సంఖ్య గడిచిన కొద్దికాలంగా పెరిగింది. ఆదాయంలో సగానికి మించి, పూర్తిగా కూడా మందుకే ఖర్చు పెడుతున్న వారి సంఖ్య పెరిగింది. రోజువారీ కూలికి వెళ్లి ఆదాయం తెచ్చుకునే ఎంతోమంది కుటుంబాల్లో ఇదే పరిస్థితి ఉంది. రోజు కూలికి వెళితే ఐదు వందలు నుంచి ఏడు వందల రూపాయల వరకు వస్తే...అందులో మూడు, నాలుగు వందలు మద్యానికే ఖర్చు చేసేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ మధ్య కాలంలో తాగుడుకు బానిసలుగా మారిన వారి సంఖ్య పెరుగుతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు. గతంలో కాస్తో, కూస్తో తాగేవారని, ఇప్పుడు పరిధికి మించి తాగుతూ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారంటూ మద్యానికి బానిసైన వారిని కుటుంబ సభ్యులు మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళుతున్నారు. ప్రతి పది కేసుల్లో కనీసం నాలుగు అవే ఉంటున్నాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎన్‌ఎన్ నిహాల్ తెలిపారు. కొంతమంది ఉదయం మొదలుపెట్టి రాత్రి పడుకునేంత వరకు తాగుతూనే ఉంటున్నారని, అటువంటి వారికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని ఆయన వెల్లడించారు.

మళ్లీ భూ యజ్ఞం!

... 5వ పేజీ తరువాయి

ఆదేశించింది. అయితే ఈ విచారణ నివేదికను కూడా అధికారులు ఇంతవరకు వెల్లడించలేదు. లోకాయుక్తకు పూర్తి వివరాలు పంపామని స్థానిక రెవెన్యూ అధికారులు చెబుతున్నా, ఆ నివేదికలో వివరాలు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. విస్సన్నపేట భూములపై లోకాయుక్త కోర్టులో కేసు విచారణలో ఉండగా.. అక్రమార్కులు మళ్లీ భూముల్లోకి వచ్చి రియల్ ఎస్టేట్ వెంచర్ పనులు జోరుగా సాగిస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో ఎత్తుపల్లాలను సరిచేస్తున్నారు. కొండవాలు ప్రాంతం నుంచి రంగబోలు గెడ్డకు వర్షపు నీరు ప్రవహించే గోర్జిలను కప్పేసి, గ్రావెల్‌తో చదును చేస్తున్నారు. విస్సన్నపేటలో 3.7 ఎకరాల డి.పట్టా భూములు ఉన్నట్టు గతంలో రెవెన్యూ అధికారులు తేల్చి ఒక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డు కనిపించడంలేదు. వారం రోజుల నుంచి పనులు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి అయినా చూడడంలేదు. ఇదిలా ఉండగా విస్సన్నపేట భూములపై లోకాయుక్తలో కేసు విచారణలో ఉండగా లేఅవుట్ పనులు ఏ విధంగా చేస్తున్నారో అర్థం కావడం లేదని, దీనిపై మరోసారి లోకాయుక్త, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని జనసేన అధికార ప్రతినిధి దూలం గోపి తెలిపారు.

చోడవరం
నియోజకవర్గం



రద్దు చేసిన భూముల్లో నిరసన తెలుపుతున్న గదబపాలెం ఆదివాసీలు

పట్టాలు పునరుద్ధరించాలని ఆందోళన

» రద్దు చేసిన భూముల్లోనే నిరసన తెలిపిన ఆదివాసీ రైతులు

రావికమతం, ఫిబ్రవరి 11: జగనన్న రీ సర్వేలో రద్దు చేసిన తమ భూ పట్టాలను పునరుద్ధరించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రద్దు చేసిన భూముల్లోనే ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాధిత రైతుల సంఘం ప్రతినిధులు అప్పిలి గడ్డమ్మ, ధోని రాజేశ్వరి, అప్పిలి నూకరాజు తదితరులు మాట్లాడుతూ కొట్నాబిల్లి పంచాయతీ శివారు రామన్నదొరపాలెంలోని రెవెన్యూలో 120పి, 129/1, 2, 3, 5పి, 6, 7 సర్వే నంబర్లలోని 16 ఎకరాల 72 సెంట్లు ల్యాండ్ సీలింగ్ భూమికి 1976లో 17 కుటుంబాలకు పట్టాలు ఇచ్చారని చెప్పారు. అప్పటి నుంచి తామే సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. వెబ్‌ల్యాండ్ రికార్డులో తమ పేరుతోనే వన్‌బీ కాపీలు ఉన్నాయన్నారు. అయితే జగనన్న రీ సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులకు తమ భూముల పట్టాలు, వన్‌బి కాపీల జెరాక్స్‌లు కూడా ఇచ్చామని వారు తెలిపారు. రీ సర్వే అనంతరం బ్యాంకు రుణాల కోసం బ్యాంకుకు వెళ్లగా భూ హక్కు పత్రాలు కొత్తవి తీసుకు రావాలని అధికారులు తెలపడంతో పరిశీలించామని, ఆర్‌వోఆర్ రికార్డులో ప్రభుత్వ భూములుగా మార్చేశారని ఆదివాసీలు వాపోయారు. రద్దు చేసిన పట్టాలను తక్షణమే పునరుద్ధరించాలని, రెవెన్యూ అధికారుల పొరపాట్లను సరిచేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. దీనిపై ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పల్లెకు పోదాంలో కేంద్ర పథకాలపై అవగాహన



వడ్డిపలో కేంద్ర పథకాల క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రోలుగుంట, ఫిబ్రవరి 11: మండలంలోని వడ్డిప, రత్నంపేట, బుచ్చెంపేట గ్రామాల్లో బీజేపీ నాయకులు ఆదివారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలను వివరించారు. గత పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలో అనేక విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారని, అన్ని వర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేశారని పార్టీ మండల అధ్యక్షుడు తమ్మునాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అప్పలనాయుడు, రమణ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పంచాయతీల అభివృద్ధి శూన్యం

» టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు



చీడికాడ పాదయాత్ర చేస్తున్న రామానాయుడు, పీవీజీ.కుమార్, నాయకులు

చీడికాడ, ఫిబ్రవరి 11: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో గ్రామ పంచాయతీల అభివృద్ధి శూన్యమని టీడీపీ మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు విమర్శించారు. బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చీడికాడలో ఆదివారం ప్రారంభమైన పాదయాత్ర జైతవరం, బైలపూడి, ఎ.అగ్రహారం, దిబ్బపాలెం, దండిసురవరం, తునివలస, వరహాపురం, జి.కొత్తపల్లి గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకపోగా, టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రవేశపెట్టిన పథకాల్లో కూడా కోతలు విధించి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి సీఎం జగన్ నిధులు మంజూరు చేయకపోగా, కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన నిధులను సైతం కైంకర్యం చేస్తున్నారన్నారు. దీంతో విద్యుత్ బల్బులు, డ్రైనేజీల్లో పూడికలు తీయడానికి కూడా డబ్బు లేకుండా ఆర్థిక ఇబ్బందుల్లో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నిత్యావసర సరుకులతో పాటు విద్యుత్, బస్సు చార్జీలు పెంచి పేదవారి నడ్డి విరుస్తున్నారన్నారు. మరో రెండు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, దేవరాపల్లి జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోతల పాత్రినాయుడు, టీడీపీ, జనసేన నాయకులు గండి మునలినాయుడు, పైల ముత్యాలనాయుడు, గాడి నాగరత్నం, జీవీ.మూర్తి, దారపు పెద్దినాయుడు, గౌరీపట్టపు నానాజీ, కొల్లి సూరినాయుడు పాల్గొన్నారు.

కల్యాణపులోవ కాలువ అక్విడక్టు రక్షణ గోడ ధ్వంసం

» ఆయకట్టు నుంచి వృథాగా పోతున్న సాగునీరు



ములకలాపల్లి వద్ద కూలిపోయిన కల్యాణపులోవ అక్వేడక్టు రక్షణ గోడ

రావికమతం, ఫిబ్రవరి 11: కల్యాణపులోవ ప్రధాన కాలువలో ములకలాపల్లి వద్ద గల అక్విడక్ట్ రక్షణ గోడ శనివారం కూలిపోయింది. దీంతో రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా ఆయకట్టుకు పారే లీకేజీ నీరు కాలువ గట్టులో నుంచి గెడ్డలోకి ప్రవహిస్తూ వృథాగా పోతోంది. దీంతో కాలువ మరింత కోతకు గురవుతున్నది. మండలంలోని ములకలాపల్లి, చీమలపాడు వద్ద రెండు అక్విడెక్టులు మరమ్మతులకు గురికావడంతో గత రెండేళ్లుగా రిజర్వాయర్ నుంచి వచ్చే నీరు సగం మేర ఈ అక్విడక్టల వద్దే వృథాగా పోయేది. దీంతో ఆయకట్టు భూములకు సాగు నీరు సక్రమంగా అందేది కాదు. దీంతో రైతులు విజ్ఞపుల మేరకు ఇటీవల ఎంపీ నిధుల నుంచి సుమారు రూ.9 లక్షలతో అక్విడక్టల డోన్లు మరమ్మతులు చేశారు. నిధులు చాలక రక్షణ గోడలను వదిలేశారు. అయితే కాలువ లోపల చేపట్టిన కాంక్రీటు పనులు లోపభూయిష్టంగా ఉండడం, మరోవైపు రాతి పేర్పును సక్రమంగా చేయకుండా వదిలేయడంతో నీరు లీకై రక్షణ గోడ దిగువన కోతకు గురై రాతి పేర్పుతో పాటు కాలువ గట్టు మట్టి డొలిచి గోడ కూలిపోయింది. దీనికి తక్షణమే మరమ్మతులు చేపట్టకపోతే కాలువ మొత్తం కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈ విషయమై కల్యాణపులోవ కొత్తకోట సెక్షన్ జేఈ సత్యనారాయణ దొరను వివరణ కోరగా, ధ్వంసమైన అక్విడక్ట్‌లకు మరమ్మతులు చేశామన్నారు. రక్షణ గోడగా ఉన్న రాతి పేర్పును నిధులు చాలక మరమ్మతులు చేయలేకపోయామన్నారు. కూలిపోయిన రక్షణ గోడను పరిశీంచామని, మరమ్మతుల కోసం రూ.20 లక్షలకు ప్రతిపాదనలు పంపామని, యుద్ధప్రాతికన పనులు చేపట్టి ఖరీఫ్‌కు సాగునీరు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని ఆయన వివరించారు.

పేకాట శిబిరంలో పోలీసు దాడులు

» నలుగురు అరెస్టు... రూ.4260 స్వాధీనం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 11: మండలంలోని రాజాం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.4620 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

» మానవ హక్కుల సంస్థ ప్రతినిధి బాలరాజు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 11: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మానవ హక్కుల సంస్థ జాతీయ అధ్యక్షుడు రావూరి బాలరాజు కోరారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ జాముగుడ గ్రామంలో సర్పంచ్ కొములు ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, ఓటు హక్కును వినిగించుకోవాలని కోరారు. అనంతరం జాముగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి విక్రందేవ్, ఎడ్యుకేషన్ వింగ్ ఛైర్మన్ సన్యాసినాయుడు, మండల అధ్యక్షుడు జగన్నాథం, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చిట్టిబాబు, దిశ ఫౌండేషన్ అధ్యక్షుడు సరస్వతి, గిరిజనులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న భక్తులు... (ఇన్‌సెట్‌లో) పూజలు అందుకున్న అమ్మవారు

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల, ఫిబ్రవరి 11: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేకువజాము ఆరు గంటలకు అమ్మవారిని అలంకరప్రాయంగా తీర్చిదిద్ది ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజా కార్యక్రమాలను చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించుకున్నారు. నెత్తిన ఘటాలను పెట్టుకొని అమ్మవారి ఆలయానికి కాలినడకన ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అందించి మొక్కులు చెల్లించేకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు. అలాగే అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ వెనుక భాగంలో ఉచిత అన్న సమారాధన కార్యక్రమాన్ని న్యాయవాది శ్రీనాద ప్రసాదరావు, స్థానిక నాయకుడు ప్రమోద్ ఏర్పాటు చేశారు.

మాడుగుల
నియోజకవర్గం




ఎంపీడీవో కార్యాలయ భవనం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి అభివృద్ధికి కృషి

» ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి, ఫిబ్రవరి 11: దేవరాపల్లి మండల అభివృద్ధి ఎంతో కృషి చేస్తున్నానని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో రూ.2.5 కోట్లతో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైసీపీ నేత బాస్కరరావు ఆధ్వర్యంలో బూడికి ఘన స్వాగతం లభించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను పుట్టింది తారువ గ్రామమైనా గడిపింది దేవరాపల్లిలోనని చెప్పారు. అందుకే దేవరాపల్లిని ఇష్టపడి అభివృద్ధి చేశానన్నారు. ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణాన్ని తక్కువ సమయంలో పూర్తిచేయడానికి కారకులైన ఇంజనీరింగ్ సిబ్బందిని సత్కరించారు. వివిధ కారణాలతో అనారోగ్యానికి గురైన ఎర్నాయుడు, ఎ.రమణలకు రూ.3 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, జడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ బాస్కరరావు అందజేశారు. కె.కోటపాడు జడ్పీటీసీ అనూరాధ, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, నాయకులు లాలం శారదాజానకీరాం, కురచా నారాయణమూర్తి, బూరే బాబూరావు, కర్రి సూరినాయుడు, కె.వీ.రమణ, సింహాచలంనాయుడు, మొల్లి కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని డిప్యూటీ సీఎంకు వినతి



బూడికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 11: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును యూటీఎఫ్ నాయకులు విన్నవించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వత్సవాయి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో తారువ క్యాంపు కార్యాలయంలో బూడిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి డిప్యూటీ సీఎం స్పందిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గొంది చినబ్బాయి, దొగ్గశ్రీను, కుదర కామరాజు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాభివృద్ధి'

చీడికాడ, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాభివృద్ధి జరుగుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శిరిజాం, తురువోలు, దిబ్బపాలెం, వరహాపురం గ్రామాల్లో ఆదివారం పల్లెకు పోదాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.మురళీ, సిహెచ్.శివాజీ, ఉమ, కె.సూర్యప్రకాష్ పుట్టా మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.